క్లుప్తంగా

మున్సిపల్ వెహికిల్ షెడ్డు ప్రారంభం



సత్తెనపల్లి: పట్టణంలోని 15వ వార్డు శుద్ధ బావి వద్ద రూ.35 లక్షలతో నూతనంగా నిర్మించిన పుర పాలక సంఘ వాహనాలు నిలిపే షెడ్డును ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం ప్రారంభించారు. పట్టణంలోని 13వ వార్డు పొట్టి శ్రీరాములు పార్కులోని సచివాలయ భవనంపై రూ.15.50 లక్షలతో నిర్మించిన మొదటి అంతస్తును ఆయన ప్రారంభించారు. అలాగే పట్టణంలో 20వ వార్డులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పట్టణంలోని వినాయక మండపాల వద్ద ఆయన పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

ఎరువుల నిల్వలు తనిఖీ



నకరికల్లు: ఎమ్మార్పీ ధరలకే ఎరువుల విక్రయాలు జరిగేలా పకడ్బందీగా చర్యలు తీసుకున్నామని ఏవో కె.దేవదాసు తెలిపారు. గుంటూరు జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ గోడౌన్‌లోని ఎరువుల నిల్వలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడీసీఎంఎస్ నిర్వహణలోని గోడౌన్‌లో యూరియా 20 టన్నులు, డీఏపీ 25 టన్నులు, 20-20-0-13 ఎరువులు, 10-26-26 ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి యూరియా 149 టన్నులు, డీఏపీ 134 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 65.6 టన్నుల విక్రయాలు జరిగాయన్నారు. ఎమ్మార్పీ కన్నా అధిక ధరలు వసూలు చేస్తే రైతులు సత్వరమే ఫిర్యాదు చేయాలని సూచించారు. జీడీసీఎంఎస్ ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ కోసం పడిగాపులు



రాజుపాలెం: సామాజిక పింఛన్ కోసం మండల కేంద్రంలోని సచివాలయం వద్ద సోమవారం ఉదయం నుంచి పింఛన్ కోసం వృద్ధులు పడిగాపులు కాసి అవస్థలు పడ్డారు. పింఛన్ ఎవరు ఇచ్చేది అర్థంకాక గ్రామ సచివాలయం వద్దకు వచ్చి అన్నపానీయాలు మాని వేచి చూశారు. పింఛన్ ఇచ్చే అధికారి తీరిగ్గా మధ్యాహ్నం 3 గంటలకు వచ్చి ఇవ్వడంతో ఇళ్లకు వెళ్లారు.

ముళ్లపొదలే రక్షణ గోడలు



పెదకూరపాడు : సహజంగా ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీ గోడలు రక్షణగా ఉంటాయి. కానీ మండలంలోని లగడపాడు గ్రామంలో గుజ్జర్లపూడి రహదారి వైపు వెళ్లే మండల ప్రాథమిక పాఠశాలకు ముళ్ల పొదలే రక్షణగా ఉంటున్నాయి. ఈ పాఠశాలలో 28 మంది విద్యార్థులు, ఈ పాఠశాలలోనే ఉర్దూ పాఠశాలకు సంబంధించి 15 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాలకు ఒక వైపు రక్షణ గోడ లేకపోవడంతో ముళ్లపొదలు ఏపుగా పెరిగి ప్రమాదంగా మారాయి. ఈ పొదల్లో నుంచి తరచూ పాములు వస్తున్నాయనని విద్యార్థులు దినదిన గండంగా భయం గుప్పెట్లో గడుపుతున్నారు. పక్కనే డ్రైనేజీ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతుందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ముళ్ల పొదలను తొలగించి ప్రహరీ గోడను ఏర్పాటు చేయాలని వారు వేడుకుంటున్నారు.

పదిలంగా రాజన్న జ్ఞాపకాలు

- పులిచింతల ప్రాజెక్టుకు పునాది రాయి
- 10 ఎత్తి పోతల పథకాల నిర్మాణాలకు శిలాఫలకాల ఆవిష్కరణ
- మహానేత చొరవతో కాలేజీ విద్య, సాంకేతిక విద్యకు శ్రీకారం



రైతు సదస్సులో మాట్లాడుతున్న వైఎస్సార్ (ఫైల్)

అచ్చంపేట: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి దూరమై 15 సంవత్సరాలు పూర్తయినా పెదకూరపాడు నియోజకవర్గంలో ఆయన జ్ఞాపకాలు ఇప్పటికీ పదిలంగానే ఉన్నాయి. ఆయన వేసిన అడుగులు, ఆయన ఆవిష్కరించిన శిలాఫలకాలు, ఆయన ప్రారంభించిన ఎత్తిపోతల పథకాలు, ఆయన నిర్మించిన హైలెవల్ బ్రిడ్జిలు... ఆయన మంజూరు చేసిన కళాశాలలు, ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయి. అవన్నీ మహానేత ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయే జ్ఞాపకాలు.. ఆయనకు ఏమిచ్చినా తీరని రుణానుబంధం. పులిచింతల ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నిల్వ ఉన్న రిజర్వాయర్‌లో, అలాగే ప్రాజెక్టు నుంచి దిగువకు వచ్చే ప్రతి సేద్యపు నీటి చుక్కలో వైఎస్సార్ కనిపిస్తాడు. ఏడాదిలో రెండు పంటలు పండే పచ్చటి పంట పొలాల్లో రాజన్న ప్రతిబింబం కనబడుతుంది.

నెరవేరిన మహానేత ఆశయాలు

100 సంవత్సరాల పులిచింతల ప్రాజెక్టు కలను దివంగత వైఎస్సార్ సాకారం చేశారు. ఎన్టీఆర్ పాలనలో రెండు సార్లు ప్రాజెక్టు నిర్మాణానికి ప్రయత్నించి విఫలమయ్యారు. ప్రాజెక్టు నిర్మాణానికి అంకురార్పణ చేసిన మహానేత దూరమైనా ఆయన ఆశయాలు, లక్ష్యాలు ఆయన తనయుడు జగన్‌మోహన్ రెడ్డి పాలనలో నెరవేరాయి. వైఎస్సార్ భావించినట్లుగానే 45.77 టీఎంసీల నీటి నిల్వ, 120 కిలోవాట్స్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసే పవర్ ప్రాజెక్టు పూర్తయింది. 2019 నుంచి ప్రతి వ్యవసాయ సీజన్‌లో కృష్ణా డెల్టా ప్రాంతాలలోని 23 లక్షల హెక్టార్ల భూములకు సాగునీరు అందుతుంది. రెండు పంటలు పండించుకుంటూ రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారు.

- 2008, జూన్ 5న ప్రాజెక్టు వద్ద రైతు సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన వైఎస్సార్ నియోజకవర్గంలోని పెదకూరపాడు, అచ్చంపేట, అమరావతి, క్రోసూరు మండలాల్లో సాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు కృష్ణానది నుంచి సాగునీటిని అందించేందుకు ఒకే సారి 10 ఎత్తిపోతల పథకాల నిర్మాణాలకు రూ.250 కోట్ల నిధులు మంజూరు చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఇప్పుడు ఆ పథకాలు పూర్తయి నియోజకవర్గంలో పంట పొలాలు కళకళలాడుతున్నాయి.

+అదేరోజు హైస్కూలు విద్యతోనే సరిపెట్టుకుంటున్న ఇక్కడి విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాల కావాలని కోరగా మహానేత అక్కడికక్కడే మంజూరు చేశారు. 18 మందితో ప్రారంభమయిన కళాశాలలో ఇప్పుడు 400 మంది విద్యార్థులు చదువుతున్నారు. క్రోసూరు మండలంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేశారు. క్రోసూరు జెడ్పీ హైస్కూలు అదనపు గదులలో ప్రారంభమైన పాలిటెక్నిక్ విద్య జగన్ మోహన్ రెడ్డి పాలనలో రూ.7 కోట్ల నిధులతో పక్కా భవనంలో దేదీప్యమానంగా వెలుగొందుతోంది. బెల్లంకొండ మండలంలోను మహానేత మరో ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేశారు. అంతేకాక నియోజకవర్గంలోని 5 మండలాల్లో బాలికల కోసం ప్రత్యేకంగా కేజీబీవీలను స్థాపించారు.

- అమరావతి మండలం నరుకుళ్లపాడు లో లెవల్ బ్రిడ్జిలో పడి 8 మంది మృతి చెందడంతో తీవ్ర మనస్తాపానికి గురైన వైఎస్సార్ నరుకుళ్లపాడు, ఎండ్రాయి బ్రిడ్జిలను హై లెవల్ చేసేందుకు నిధులు మంజూరు చేశారు. ఆ రెండు బ్రిడ్జిల నిర్మాణాలు పూర్తి కావడంతో ఇప్పుడు ఎంత వర్షం పడినా ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులూ లేవు.

మహానేత వైఎస్సార్ వర్ధంతిలో పాల్గొనండి

అమరావతి/ క్రోసూరు/ అచ్చంపేట: మండల కేంద్రమైన అమరావతిలో నిర్వహించే మహానేత వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో మండల పరిధిలోని అన్ని గ్రామాల పార్టీ కార్యకర్తలు, నాయకులు, వైఎస్సార్ అభిమానులు పాల్గొనాలని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మంగళవారం ఉదయం 9 గంటలకు స్థానిక కచేరి సెంటర్‌లోని మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి అనంతరం గుంటలమ్మ చెట్టు సెంటర్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అలాగే క్రోసూరులోని నాలుగు రోడ్ల సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి ఉదయం 10.30 గంటలకు నివాళులు అర్పించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వెలది అప్పారావు తెలిపారు. అలాగే అచ్చంపేటలోని ఆంజనేయస్వామి విగ్రహ సెంటర్‌లో ఉదయం 11.30 గంటలకు, మాదిపాడు గ్రామంలో మధ్యాహ్నం 12.30 గంటలకు, చల్లగరిగలో మధ్యాహ్నం 1 గంటకు వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించడం జరుగుతుందని మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావుతో పాటు జిల్లా, మండల స్థాయి నాయకులు హాజరవుతారని, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై మహానేతకు నివాళులర్పించాలని వారు కోరారు.

నేడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతి

సత్తెనపల్లి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి పురస్కరించుకొని మంగళవారం నియోజకవర్గ వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు నకరికల్లు మండలం చాగల్లు, 9:30 గంటలకు ముప్పాళ్ళ మండలం చాగంటివారిపాలెం గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు, 10 గంటలకు సత్తెనపల్లి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహ ప్రతిమకు, 10.15 గంటలకు పట్టణంలోని 13వ వార్డు పొట్టి శ్రీరాములు పార్కు వద్ద, 10:30కు గ్రంథాలయం వద్ద, 10.45కు తాలూకా వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించడం జరుగుతుందన్నారు. 11:30 గంటలకు నకరికల్లు మండలం కుంకలగుంట, 3 గంటలకు చల్లగుండ్ల గ్రామాల్లో, 4 గంటలకు రాజుపాలెం మండలం పెదనెమిలిపురి, 4:30కు ఇనిమెట్ల, 5 గంటలకు నకరికల్లు మండలం లక్ష్మీపురం తండా, 5:15కు రాజుపాలెం మండలం ఉప్పలపాడు, 5.30కు బలిజేపల్లి, 6 గంటలకు అనుపాలెం, 6.20కు కోటనెమిలిపురి, 6.50కు గణపవరం గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించి అనుపాలెం, కోటనెమిలిపురి, గణపవరంలో అన్నసంతర్పణ జరుగుతుందన్నారు. రాత్రి 7.30కు సత్తెనపల్లి మండలం పాకాలపాడులో వైఎస్సార్‌కు నివాళ్ళులర్పించి అన్నసంతరణ జరుగుతుందన్నారు. 8 గంటలకు ముప్పాళ్ళలో, 8.20కు ముప్పాళ్ళ మండలం గోళ్లపాడులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి, అన్నసంతర్పణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల బాధ్యులు, వైఎస్సార్ అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లో 2వ తేదీన దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు సోమవారం కోరారు.

శాస్త్రీయ పద్ధతుల్లో వ్యర్థాల నిర్వహణ అలవర్చాలి



కమిషనర్ ఆనంద్‌కుమార్

సత్తెనపల్లి: శాస్త్రీయ పద్ధతుల్లో వ్యర్థాల నిర్వహణ విద్యార్థులకు అలవర్చాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా 'వెల్ బీయింగ్ అవుట్ ఆఫ్ వేస్ట్ (వావ్) ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దీనిలో భాగంగా విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇంటర్ స్కూల్ రీసైక్లింగ్ చాంపియన్‌షిప్ నిర్వహించి రాష్ట్ర, జాతీయ పర్యావరణ ప్రచారాల్లో విద్యార్థులను భాగస్వాములను చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్, 'ప్లానెట్ సేవియర్' బ్యాడ్జిలను బహూకరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారథి, ప్రిన్సిపాల్ లహరి, ఐటీసీ వావ్ టీమ్ ఎన్విరాన్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్ టీఎస్‌కే రియాజ్, షేక్ హాజరీషఫీ, వై.అశోక్, పి.కృష్ణ సౌజన్య, ఒ.రాజయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యాన్ని నియంత్రించి బెల్ట్ షాపులను అరికట్టాలి

ఐద్వా సత్తెనపల్లి పట్టణ మహాసభలో జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజని



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి రజని

సత్తెనపల్లి: పేదల కుటుంబాలను ఛిద్రం చేసి, మహిళలపై దాడులు, లైంగిక వేధింపులకు కారణమైన మద్యాన్ని నియంత్రించి బెల్ట్ షాపులను అరికట్టాలని ఐద్వా జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజని అన్నారు. పట్టణంలోని పుతుంబాక భవన్‌లో సోమవారం జరిగిన అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా సత్తెనపల్లి పట్టణ మహాసభలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా ఐద్వా జెండాను ఐద్వా నేత ఇంజం అరుణ ఆవిష్కరించారు. ఈ సభకు మునగా జ్యోతి అధ్యక్షత వహించారు. రజని మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక వేధింపులు, కుటుంబాలలో వస్తున్న సమస్యలపై ఐద్వా నిరంతరం పనిచేస్తుందన్నారు. ఐద్వాలో సభ్యులుగా చేరి సంఘాన్ని బలోపేతం చేసుకోవాలన్నారు. పట్టణ కార్యదర్శి గద్దె ఉమశ్రీ మాట్లాడుతూ ఇప్పటికే సంఘం మహిళలపై జరుగుతున్న దాడులు, కుటుంబాలలో మద్యం సృష్టిస్తున్న అలజడులు, జనావాసాల మధ్య మద్యం దుకాణాలు తొలగించాలని తదితర సమస్యలపై పనిచేసి అనేక విజయాలను సాధించిందన్నారు. స్థానిక సమస్యలపై పనిచేసి పట్టణంలోని అన్ని వార్డులకు సంఘాన్ని విస్తరించాలన్నారు. సీఐటీయూ పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ మహిళలపై దాడులు, అత్యాచారాలు అరికట్టాలంటే మహిళల తమ హక్కులు, చట్టాల అమలుకై ఐక్యంగా పోరాడాలన్నారు. చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అనుముల వీరబ్రహ్మం మాట్లాడుతూ కుటుంబ ఆదాయంలో అధిక భాగం మద్యం దుకాణాలకే పోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినిధి సావిత్రి మాట్లాడుతూ తనకు రూ.50 వేలు అవసరమై హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుకి వెళితే ఇంటి డాక్యుమెంట్స్ తాకట్టు పెట్టుకొని రూ.5 లక్షలకు ఇరికించి, రూ.3 లక్షలు చేతులో పెట్టారని తెలిపారు. ఈ సమస్యను ఐద్వా దృష్టికి తీసుకువెళ్లడంతో వారు అండగా నిలిచి బ్యాంక్ అధికారులపై పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టించడంతో బ్యాంక్ అధికారులు వేధింపులు ఆపారని ఆమె వాపోయింది. మద్యం, మత్తు పదార్థాలను అరికట్టాలని, బెల్ట్ షాపులను రద్దు చేయాలనే తీర్మానాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం 13 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులుగా కె.సుధారాణి, గద్దె ఉమశ్రీ, గౌరవ అధ్యక్షులుగా ధరణికోట విమల, ఉపాధ్యక్షులుగా మునగా జ్యోతి, సహాయ కార్యదర్శిగా జె.స్పందన తదితరులను ఎన్నుకున్నారు.

పారిశుధ్యం మెరుగుపరచండి

డిస్ట్రిక్ట్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ అజితకుమారి



అమరావతి: సత్తెనపల్లి డిపో పరిధిలోని అమరావతి, పెదకూరపాడు బస్ స్టేషన్లను పల్నాడు డిస్ట్రిక్ట్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ టి.అజితకుమారి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బస్టాండులలోని టాయిలెట్‌లు, గెస్ట్‌రూంలు బస్టాండు ఆవరణలో పారిశుధ్యం మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే కంట్రోల్ రూం నిర్వహణలో ప్రయాణికులకు జవాబుదారీతనం ఉండాలన్నారు. బస్టాండులో ఉన్న దుకాణాలు, వాహనాల పార్కింగ్ పారదర్శకతతో జరగాలన్నారు. బస్టాండులో ఇబ్బడిముబ్బడిగా పెరిగిన చెట్లను కూడా క్రమపద్ధతిలో నరికించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సత్తెనపల్లి డిపో మేనేజర్ కుమార్‌కు తగు సూచనలు, ఆదేశాలు జారీచేశారు. పలువురు ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

మా గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయొద్దు

- భీమవరం, గండ్లూరు గ్రామస్తుల ఆందోళన
- కలెక్టర్‌ను కోరిన ఆయా గ్రామాల నాయకులు, గ్రామస్తులు



కలెక్టరేట్‌కు ప్రదర్శనగా వస్తున్న భీమవారం గ్రామ నాయకులు, గ్రామస్తులు



పీజీఆర్ఎస్‌లో డీఆర్ఓ మురళికి అర్జీ అందజేస్తున్న నాయకులు, గ్రామస్తులు

నరసరావుపేట/సత్తెనపల్లి: సత్తెనపల్లి మండలంలోని భీమవరం, గండ్లూరు గ్రామాలను పురపాలక పరిధిలో బలవంతంగా విలీనం చేయొద్దంటూ ఆ గ్రామాల నాయకులు, గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా వచ్చిన వారు ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అధికారులకు వినతి పత్రం సమర్పించారు. గ్రామంలోని సుమారు 1500 మంది ఎస్సీ, ఎస్టీలకు వ్యవసాయ కూలి పనులే జీవనాధారమని, అన్ సీజన్‌లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కల్పించే పనులతో జీవిస్తున్నామన్నారు. సత్తెనపల్లి పురపాలక సంఘంలో మండలంలోని భీమవరం, గండ్లూరు గ్రామాలను విలీనం చేయొద్దంటూ ఆయా గ్రామాలకు చెందిన కొల్లు మల్లేశ్వరరావు, బొడ్డు వెంకటేష్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల ప్రజలు సోమవారం వేర్వేరుగా ఆందోళన చేపట్టారు. మున్సిపాలిటీ వద్దని పంచాయతీ ముద్దు అని ప్లకార్డులతో నినాదాలు చేశారు. ఆర్డీవో జీవీ రమణాకాంతరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్‌తో పాటు ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామంతా భూమి లేని పేదలమని, వ్యవసాయ కూలీ పనులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామన్నారు. తమ గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేస్తే తాము జీవనోపాధి కోల్పోయి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఉపాధి హామీ పథకం పనులు చేసే పరిస్థితులు లేనందున పనులు లేని సమయంలో ఉపాధి లేక వలస పోవలసిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. కూలి పనులు చేసుకుని జీవించే తమకు మున్సిపాలిటీ పన్నులు పెనుభారం అవుతాయన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీలో విలీనం చేస్తే సత్తెనపల్లి మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరిగాల్సి వస్తుందని దీంతో సమయం, డబ్బు వృధా అవుతుందని, కావున పరిశీలించి, విలీన ప్రక్రియను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో భీమవరం గ్రామస్తులు పాలేటి పిచ్చయ్య, పాలెపోగు బాలయ్య, సోమినేని జగన్నాధరావు, గద్దం బ్రహ్మానందం, ఒంటిపులి దానయ్య, ఒంటి పులి శంకర్, చల్లాబాల నాగేశ్వరరావు, గండూర్లు గ్రామస్తులు గణపవరపు వినాయకుడు, ఎస్‌డీ మాబుసైదా, అచ్చి వెంకటేశ్వర్లు, బొడ్డు నరసింహారావు తదితరులు ఉన్నారు.

డ్రైనేజీకి రంధ్రం.. పొంచి ఉన్న ప్రమాదం



నకరికల్లు గంగమ్మగుడి సమీపంలో హైవే పక్కన ప్రధాన డ్రైనేజీకి పడిన భారీ రంధ్రం



వర్షం సమయంలో హైవేపై చేరిన మురుగునీరు (ఫైల్)



- ధ్వంసమైన ప్రధాన డ్రైనేజీ పైభాగం
- వర్షం పడితే రోడ్డుపై వాగులా వస్తున్న డ్రైనేజీ నీరు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

నకరికల్లు: హైవే పక్కన సర్వీసు రోడ్డుకు అనుకొని ఉన్న ప్రధాన డ్రైనేజీకి రంధ్రం ఏర్పడింది. దీంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారికి ఆనుకొని ఉన్న డ్రైనేజీ కావడంతో స్థానిక ప్రజలు, హైవే ప్రయాణికులకు ప్రమాదకరంగా మారింది. స్థానిక వై జంక్షన్ సమీపంలోని గంగమ్మతల్లి ఆలయానికి సమీపంలో ప్రధాన డ్రైనేజీ పైభాగం పూర్తిగా ధ్వంసమైంది. దీంతో పెద్ద గొయ్యి ఏర్పడింది. అలాగే పశు వైద్యశాల సమీపంలో డ్రైనేజీ పై మూతలు విరిగిపోవడంతో ప్రమాదకరంగా మారింది. స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలోను ఇదే పరిస్థితి నెలకొంది. డ్రైనేజీ ధ్వంసమైన ప్రాంతంలో ఆదమరిస్తే వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. దీనికి తోడు కొద్దిపాటి వర్షం పడినా డ్రైనేజీలోని నీరంతా సర్వీసు రోడ్డుపైకి, హైవే పైకి చేరుతుంది. వర్షపునీరు నిలవడంతో గోతుల వద్ద ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రాత్రివేళల్లో, వర్షం పడిన సమయంలో గోతులు కన్పించక మరింతగా ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. వ్యర్థాలు చేపడంతో దుర్వాసన వెదజల్లుతుంది. అధికారులు తక్షణమే స్పందించి ధ్వంసమైన డ్రైనేజీ పైభాగం మరమ్మతులు చేసి రంధ్రం పూడ్చాలని వాహనదారులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.



కంటెపూడిలో నిమజ్జనానికి తరలిస్తున్న ట్రాక్టర్ నడుపుతున్న గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి



సత్తెనపల్లి కోటమ్మ సత్రం వద్ద కూచిపూడి నృత్యంలో చిన్నారులు



నాగిరెడ్డిపాలెంలో ఏర్పాటు చేసిన గణనాథుడు



రూపెనగుంట్లలో వినాయక నిమజ్జన వేడుకల్లో డాక్టర్ గజ్జల, భవనం



కుందురువారిపాలెంలోని వినాయకుని మండపం వద్ద దీపోత్సవం

ప్రత్యేక పూజలు.. నిమజ్జనాలు

- మిన్నంటిన గణపతి బప్పా మోరియా నినాదాలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

సత్తెనపల్లి: గణేష్ నిమజ్జన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా వాడవాడలా కొలువుదీరిన గణనాథులు ఆరు రోజులు పూజలు అందుకొని సోమవారం గంగమ్మ ఒడికి చేరారు. ఉత్సవంలో భాగంగా విఘ్నేశ్వర ప్రతిమలకు ఉత్సవ కమిటీ సభ్యులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు, అర్చనలు, అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో నిమజ్జనానికి తరలించారు. సత్తెనపల్లి పట్టణంలో ఈ కార్యక్రమం కనుల పండుగగా సాగింది. శోభాయాత్రలో చిన్నారులు, మహిళలు, పెద్దలు అందరూ ఒకరిపై ఒకరు వసంతం చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. జై బోలో గణేష్ మహారాజ్‌కీ, గణపతి బప్పా మోరియా నినాదాలు మధ్య గణపతి విగ్రహాలు నిమజ్జనానికి తరలాయి. గణేష్ మండపాల వద్ద వేలంలో గణనాథుడి లడ్డూలను దక్కించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. కంటెపూడిలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి పూజలు నిర్వహించి ట్రాక్టర్ నడిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, మాజీ యూత్ అధ్యక్షుడు కళ్ళం విజయభాస్కరరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. పట్టణ గుంటూరు రోడ్‌లోని అమరావతి బ్రాంచ్ కెనాల్ వద్ద సీఐ నరహరి నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సత్తెనపల్లి మండలంలో సత్తెనపల్లి రూరల్ సీఐ ఎంవీ సుబ్బారావు ఆధ్వర్యంలో ఎస్ఐ అమీనుద్దీన్, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కుందురువారిపాలెంలో దీపోత్సవం

ముప్పాళ్ళ: మండలంలోని గ్రామాల్లో సోమవారం ప్రత్యేక పూజలు, అన్నదానాలు నిర్వహించారు. కుందురువారిపాలెంలో దీపోత్సవం నిర్వహించారు.

రూపెనగుంట్లలో...

నకరికల్లు: మండలంలోని రూపెనగుంట్ల గ్రామంలో విఘ్నేశ్వర నిమజ్జన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి, మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణనాథుని నిమజ్జనాలు

బెల్లంకొండ: మండలంలోని పలు గ్రామాలలో సోమవారం గణనాథుని నిమజ్జన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఐదు రోజుల పాటు బొజ్జ గణపయ్యకు పూజలు జరిపారు. ఆరవ రోజున మేళతాళాల నడుమ నిమజ్జనానికి తరలించారు.

నందిగామలో వ్యక్తి బలవన్మరణం

సత్తెనపల్లి: మండలంలోని నందిగామలో సోమవారం ఏటుకూరు జాను (26) ఇంట్లో ఉరేసుకొని మృతి చెందాడు. నెల రోజుల క్రితం గొడవపడటంతో భార్య ఆత్మహత్య చేసుకోగా, మనస్థాపంతో జాను ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి ఏడాది కుమారుడు, 6నెలల కుమార్తె ఉన్నారు. రూరల్ పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.